క్లుప్తంగా

గడ్డి వాము దగ్ధం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి వాము దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్న సమయంలో గడ్డి వాములో మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖా కార్యాలయానికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. స్వల్పంగా నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖాధికారి గంగాదాస్ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: భూమి విషయంలో దాడికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకుడు మహేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు ఎండీ సలీం శుక్రవారం సీఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేశాడు. పెర్కిట్‌లోని ఓ భూమి విషయంలో తనపై మహేందర్ దుర్భాషలాడుతూ దాడిచేశాడన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

స్కానింగ్ సెంటర్‌ను మూసివేయాలి



బోధన్: జిల్లా కేంద్రంలో స్కానింగ్ కోసం వెళ్లిన మహిళలపై అసభ్య ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి వారి ఆత్మాభిమానం దెబ్బతీసిన అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌ను మూసివేయాలని ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై శుక్రవారం పీవోడబ్ల్యూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో ఆఫీసులో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్లల్లో పురుషులకు బదులు మహిళలతో స్కానింగ్ చేయించాలన్నారు. స్కానింగ్ సెంటర్లల్లో ఆశా వర్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రతినిధులు బిపాషా బేగం, పార్వతి, లక్ష్మి, పోశవ్వ, సావిత్రి, రాజమణి, గంగామణి పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే కమీషన్ పెంపు

నవీపేట: తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టేకేదారుల తరపున నిర్వహించిన ఉద్యమాలతోనే కమీషన్ పెంపునకు యాజమాన్యాలు అంగీకరించినట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత రెండేళ్ల క్రితం టేకేదారు యూనియన్ల ఆధ్వర్యంలో బీడీ యాజమాన్యాలతో జరిగిన ఒప్పందం గత మార్చితో ముగిసిందన్నారు. శుక్రవారం నిర్వహించిన ఒప్పందం మేరకు వెయ్యి బీడీలకు టేకేదారుడికి రూ. 4.50లు అదనంగా చెల్లించేందుకు యాజమాన్యాలు అంగీకరించాయన్నారు.

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి



బాల్కొండ: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎస్సారెస్పీ నూతన ఎస్ఈగా నియమితులైన శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మెండోరా మండలం దూదిగాంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శ్రీనివాస్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఎస్ఈ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, జెన్‌కో ఎస్ఈ శ్రీనివాస్, డిప్యూటీ ఈఈలు గణేశ్, రఘుపతి, ఏఈఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్‌ను నియమించాలి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని రాంపూర్ సొసైటీ చైర్మన్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ బదావత్ తారాచంద్ నాయక్‌ను ఉమ్మడి ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా నియమించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్ డిమాండ్ చేశా రు. ఈమేరకు శుక్రవారం జిల్లా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌అలీని కలిసి వినతిప త్రం అందజేశారు. తారాచంద్ నాయక్, జెడ్పీటీసీ మాన్‌సింగ్ నాయక్, మాచారెడ్డి సొసైటీ చైర్మన్ పూల్‌చంద్ నాయక్, ఏఐబీఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తుకారం నాయక్, సలహాదారు బాల్‌రాజ్ నాయక్, చందర్‌నాయక్, బలరాం నాయక్ లాల్‌సింగ్ నాయక్ ఉన్నారు.

రోహిణి కార్తెలో సాగు ఫలించేనా?

- మక్క విత్తడానికి రంగం సిద్ధం?
- వర్షాలు ముందుగా కురిస్తేనే పంట చేతికి వచ్చే పరిస్థితి



ఆర్మూర్‌లో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



ఆర్మూర్ ప్రాంతంలోని పొలాల్లో వేసిన సేంద్రియ ఎరువులు

ఆర్మూర్: ప్రతికూల పరిస్థితుల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించి మంచి దిగుబడి సాధించడంలో జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న ఆర్మూర్ ప్రాంత రైతాంగం ఈ ఏడాది రోహిణి కార్తెలో మొక్కజొన్న పంట సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు ఈ ఏడాది వర్షాలు ముందుగా కురిసే అవకాశం ఉంది. ఆ నమ్మకంతో పెట్టుబడిని లెక్కచేయకుండా మొక్కజొన్న విత్తేందుకు సిద్ధమవుతున్నారు. మే నెల మూడో వారంలో రోహిణికార్తె ప్రవేశం చేయగానే ఆర్మూర్ ప్రాంత రైతులు హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను ఎంపిక చేసుకొని మొక్క జొన్న పంటను వేస్తారు. రోహిణి కార్తెలో వేసిన మొక్కజొన్న పంట జూలై ఆఖరు నాటికి పంట చేతికి వస్తుంది. అప్పుడు మొక్కజొన్న పచ్చిబుట్టకు అధికంగా డిమాండ్ ఉంటుంది. దీంతో రైతులకు పచ్చి మొక్కజొన్న బుట్టలను విక్రయించడం వల్ల అధిక శ్రమ లేకుండా లాభపడతారు. మొక్కజొన్నను ముందుగా వేయడం వల్ల ఈ పంటను వేసిన భూమిలో డిసెంబర్ నాటికి రెండో పంటను, తిరిగి రబీలో మూడో పంటను పండించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితులను సద్వినియోగం చేసుకోవడానికి ఆర్మూర్ ప్రాంతంలో రైతులు ఖరీఫ్ మెట్ట పంటలు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నెల మూడోవారం నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ మెట్ట పంటల కోసం రైతులు తమ భూములను దుక్కిదున్నటం, సేంద్రియ ఎరువులు వేసుకోవడం చేస్తున్నారు. ఖరీఫ్‌లో మొదటి పంటగా మొక్కజొన్న పంట సాగు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల ఎకరాలలో బోరుబావుల కింద మొక్కజొన్న పంటను ఖరీఫ్ మొదటి పంటగా వేసే అవకాశముంది. ఆర్మూర్ ప్రాంతంలో 90 శాతం వ్యవసాయం బోరు బావులకిందే సాగువుతుంది. ఇందులో మెట్ట పంటలు బోరు బావుల నీటితోనే పండుతాయి. మెట్ట పంటలలో మంచి ఆదాయాన్నిచ్చే మొక్కజొన్న పంటలను ఆర్మూర్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో సాగు చేస్తారు. కానీ ప్రస్తుత కరువు పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రస్తుత రబీ మెట్ట, మాగాణి పంటలకు సాగునీరు కొరత ఏర్పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రబీ వరి కోతలు, ముగించుకున్న రైతులు సజ్జ పంటను పూర్తిచేసుకొని ఖరీఫ్‌నకు సిద్ధమవుతున్నారు. మొక్కజొన్న పంటకు నల్లమట్టిని, పశువుల పేడతో కూడిన సేంద్రియ ఎరువులను వేస్తున్నారు. దీంతో పాటు తొలకరి వర్షాలు కురవగానే పసుపు పంట వేయడానికి కూడా అవసరమైన సేంద్రియ ఎరువులను లారీల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకుంటున్నారు. రబీ పంటలను ముగించుకోవడంతో ఖరీఫ్ పంటలను వేసుకోడానికి అవసరమైన ఏర్పాట్లలో రైతులు బిజీగా ఉన్నారు.

పొగాకుతో అనారోగ్య సమస్యలు



కూనేపల్లిలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

రెంజల్ : బీడీలు, సిగరెట్, గుట్కా, పొగాకు వంటి ఉత్పత్తులతో తయారయ్యే వాటిని తాగడం, నమలడం, పీల్చడం చేస్తే అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని బోధన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమోదిత అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని సబ్‌సెంటర్‌లలో శుక్రవారం అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. కూనేపల్లి, వీరన్నగుట్ట గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ప్రమోదిత మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా బతుకులను ఆగం చేస్తున్న మత్తు ఉత్పత్తులను మానుకోవాలని సూచించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్‌లతో పాటు రక్తనాళాలు దెబ్బతిని గుండె సమస్యలు, చర్మవ్యాధులు, సైడ్ ఎఫెక్ట్ వచ్చే అవకాశాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్/ నవీపేట: వరల్డ్ నో టుబాకో దినోత్సవం సందర్భంగా డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ ప్రజలకు అవగాహన కల్పించారు. పాన్ మసాల, తంబాకు, గుట్కాలు తింటే నోటి క్యాన్సర్ వస్తుందని, అలాగే సిగరేట్, బీడీలు కాల్చితే ఊరిపితిత్తులు చెడిపోయి క్యాన్సర్‌కు దారితీస్తుందన్నారు. ఈ ప్రాణాంతకమైన క్యాన్సర్‌కు గురి కాకుండా ప్రజలు ధూమపానం, గుట్కాలకు దూరంగా ఉండాలన్నారు. నవీపేట మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం నిర్వహించారు. జీవితంలో పొగాకు ఉత్పత్తులకు బానిస కానని, వాటి నుంచి నా కుటుంబాన్ని దూరంగా ఉంచుతానని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌వైజర్ కిషన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డొంకేశ్వర్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



నవీపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

ఆర్మూర్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. మొత్తం 39 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి అన్నారు. గత కమిషనర్ ఇష్టానుసారంగా ఇంటినంబర్లు కేటాయించారని దానిపై విజిలెన్స్ అధికారులలో విచారణ చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ భూమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులతో సంఘం ప్రతినిధులు

పెర్కిట్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శుక్రవారం పదో తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించిన ఆదివాసి నాయక్‌పోడ్ విద్యార్థులకు ఉద్యోగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్ అధ్యక్షతన ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా గాండ్ల రాంచందర్ మాట్లాడుతూ.. ఆదివాసి నాయక్‌పోడ్ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి సంఘ ప్రోత్సాహం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అలాగే త్వరలో నేపాల్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొనే ఆదివాసి విద్యార్థి మంద రిషిక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీసీడీవో సింగం వనిత, వైద్యుడు మంతెన రవి కుమార్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న, గడ్డం శంకర్, కొసెడుగు రవి, మినుగు రాజేశ్వర్, కొండ్రు నవీన్, రాజు, గంగాధర్, రాంప్రసాద్, శ్రీనివాస్, సురేశ్ రుక్మాజి, సంజీవ్, పవన్, ధాత్రి అంజయ్య, మూడ అశోక్, మారుతి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు



రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి చెరువులో కొందరు రాత్రి వేళల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికులు తహసీల్దార్ వెంకటేశంకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కాగా గురువారం సైతం గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ ఘటన స్థలానికి చేరుకుని జేసీబీతో సహ ఆరు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం అదే రోజు రాత్రి మట్టి తవ్వకాలు చేపట్టడం గమన్హారం. చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

పిల్లల బరువును యాప్‌లో నమోదు చేయాలి



రెంజల్: ఇంటింటికి తిరుగుతూ పోషణ అభియాన్ యాప్‌లో పిల్లల బరువును నమోదు చేయాలని ఐసీడీఎస్ బోధన్ సీడీపీవో జానకి సూచించారు. రెంజల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అంగన్వాడీ టీచర్ల సమావేశంలో సీడీపీవోతో పాటు జిల్లా అధికారి రాంబాబు హాజరై మాట్లాడారు. పిల్లల బరువును నమోదు చేయని టీచర్లపై చర్యలు తప్పవన్నారు. వంద శాతం సర్వేను పూర్తి చేయాలని సూచించారు. రెండున్నర సంవత్సరాల పిల్లలను కేంద్రాల్లో చేర్పించుకునాలని పేర్కొన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో మండల సూపర్‌వైజర్ ప్రమీలరాణి పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



వినయ్‌రెడ్డితో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు

ఆర్మూర్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నిర్వహణలో యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డిని కోరారు. పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి తమ సమస్యలను వివరించారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు రాస నిత్యానందం, జనరల్ సెక్రటరీ గోజూరి అరుణ్, స్టేట్ జాయింట్ సెక్రెటరీ పండ్ల రమేశ్, నందిపేట్, మాక్లూర్ మండలాల అధ్యక్షులు చుక్కబొట్ల దేవన్న, గంగాధర్ గౌడ్, ఆర్మూర్ పట్టణ టౌన్ సెక్రటరీ ప్రవీణ్ పవార్, ప్రకాశ్, కానూరి గంగాసాగర్, సన్నీ, చిరంజీవి, పృథ్వి, వేణు, పాఠశాల కరస్పాండెంట్లు ఉన్నారు.

నేడు ప్రపంచ పాల దినోత్సవం

ఎడపల్లి: మండలంలోని జైతాపూర్‌లో ప్రపంచ పాల దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎస్‌కేపీసీఎల్ చైర్మన్ గీతాదేవి, కోఆర్డినేటర్ పాపారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి తమిళనాడు ప్రభుత్వ డిప్యూటీ చైర్మన్ శాంతశీల, యూఎన్డీపీ ప్రాజెక్ట్ ఎండీ డాక్టర్ రాజారతీనమ్ హాజరు కానున్నట్లు వెల్లడించారు.

దేశ స్థితిగతులను మార్చే శక్తి కార్మికులకే ఉంది



మాట్లాడుతున్న రాంచందర్

ఆర్మూర్: భారతదేశ స్థితిగతులను మార్చే శక్తి కార్మికులకే ఉందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కేజీ రాంచందర్ అన్నారు. మండలంలోని పిప్రిలో ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను రెండో రోజైన శుక్రవారం నిర్వహించారు. డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పార్టీ కార్యక్రమం అనే అంశంపై బోధించారు. దేశంలో విప్లవ కార్యక్రమం విజయవంతం చేయడంలో కార్మికవర్గం పాత్ర ప్రధానమన్నారు. ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే ప్రధాని మోదీ రామ జపం చేస్తూ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. ప్రభాకర్, రామకృష్ణ, దేవరాం, ముత్తన్న, సత్తెమ్మ, రమేశ్, నరేందర్, అనిల్, అనిస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు ఫిర్యాదు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భీమ్‌గల్: మండలంలో ఇసుక అక్రమ రవాణా చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఆర్మూర్ ఆర్డీవోకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని బెజ్జోరా గ్రామంలోని రెండు ప్రాంతాల నుంచి రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందలాది ట్రాక్టర్లు, ట్రిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని అన్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీలతకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



ఆర్మూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు



నందిపేటలో..



రుద్రూర్‌లో..

నందిపేట్/ రుద్రూర్/ బాల్కొండ/ కమ్మర్‌పల్లి/ ఆర్మూర్‌టౌన్/ ఎడపల్లి/ భీమ్‌గల్: ఎరువుల దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పేర్కొన్నారు. నందిపేట మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న, పోలీసులు తనిఖీ చేపట్టి రికార్డులను పరిశీలించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ వెంకటేశం, మండల వ్యవసాయాధికారి నగేశ్‌రెడ్డి, ఎస్సై అప్పారావు తనిఖీలు చేపట్టారు. బాల్కొండ మండల పరిధిలోని విత్తన దుకాణాలను బాల్కొండ ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మెండోరాలో మండల వ్యవసాయాధికారి రాజుకుమార్, తహసీల్దార్ సంతోష్‌కుమార్, ఎస్సై శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. కమ్మర్‌పల్లి మండల పరిధిలోని విత్తన దుకాణాలను మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ తనిఖీ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని పలు విత్తన దుకాణాలను తహసీల్దార్ గజానన్ తనిఖీ చేశారు. ఏవో హరికృష్ణ, ఎస్‌హెచ్‌వో రవికుమార్, వ్యవసాయాధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. ఎడపల్లి మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను మండల టాస్క్ ఫోర్స్ సభ్యులు తహసీల్దార్ ధన్వాల్, ఎస్సై వంశీధర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్ తనిఖీలు చేపట్టారు. భీమ్‌గల్ మండలంలోని ఎరువుల దుకాణాలను ఏవో సాయికృష్ణ, సీఐ శ్రీనివాస్, ఎస్సై హరిబాబు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

విత్తన డీలర్లతో సమావేశం



వేల్పూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం మండలంలోని విత్తన డీలర్లతో టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, తహసీల్దార్ సరిత, ఎస్సై వినయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి నర్సయ్య డీలర్లకు పలు సూచనలు చేశారు. గడువు ముగిసిన, నాణ్యతలేని విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. విత్తన డీలర్లు, ఏఈవోలు పాల్గొన్నారు.



బాల్కొండలో..



ఎడపల్లిలో..



భీమ్‌గల్‌లో..

ఆధ్యాత్మికం..

సాయిబాబా ఆలయంలో పూజలు



బోధన్‌టౌన్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సత్సంగం వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. ఆలయంలో సత్సంగం ఏర్పాటు చేసి 29 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అశోక్ కులకర్ణి, ప్రతినిధులు శర్మ, భరత్ భూషణ్, భక్తులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – లవ్‌మీ (తెలుగు) - 12.05, 6.15; ఫ్యూరియోసా (తెలుగు) - 3.00; హిట్‌లిస్ట్ (తెలుగు) - 9.10
- స్క్రీన్-2 – గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) - 10.00, 1.05, 4.10, 7.15, 10.20
- స్క్రీన్-3 – గంగం గణేశా (తెలుగు) - 12.15, 3.20, 6.25, 9.30
- స్క్రీన్-4 – భజే వాయువేగం - 10.35, 1.30, 4.25, 7.20, 10.15

పండ్ల పంపిణీ

పెర్కిట్: అంకాపూర్‌లో ఉన్న లాలన వృద్ధాశ్రమ వృద్ధులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పండ్లు, టవల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి పట్వారి తులసి కుమార్, క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కోశాధికారి లక్ష్మీ నారాయణ, పుష్కార్ రావు, ప్రవీణ్ పవార్, దామోదర్, సత్యం పాల్గొన్నారు.